క్లుప్తంగా

న్యాణ్యమైన విద్యుత్ అందించాలి



పిడుగురాళ్ల: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ఎస్ఈ డాక్టర్ పి. విజయకుమార్ అన్నారు. పట్టణంలోని కొండమోడు విద్యుత్ రెవెన్యూ ఆఫీసులో నరసరావుపేట, మాచర్ల డివిజన్‌లోని అధికారులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... పెండింగ్‌లో పనులను పూర్తి చేయాలని సూచించారు. పీఎం సూర్య ఘర్ ఎస్సీ, ఎస్టీ కాలనీలోని వినియోగదారులకు అవగాహన కల్పించి నూరు శాతం అప్లికేషన్స్ ఈ నెల 21వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. మాచర్ల ఈఈ నూతలపాటి సింగయ్య, నరసరావుపేట ఈఈ సీహెచ్ రాంబొట్లు, ఈఈ జె. శ్రీనివాసులు రెడ్డి, ఈఈ రామసుబ్బారావు, ఎస్ఏవో సుబ్బారావు, పిడుగురాళ్ల డీఈఈ బి. నాగ సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక బలగాల కవాతు



కారెంపూడి: పంట పొలాల విధ్వంసం, ఆస్తి నష్టం లాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న అసాంఘిక శక్తులను హెచ్చరిస్తూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామంలో శుక్రవారం కవాతు నిర్వహించారు. వరుస అవాంఛనీయ ఘటనల నేపథ్యంలో ఈ మేరకు ఏఎస్పీ సంతోష్, డీఎస్పీ జగదీష్, సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్ఐ వాసు కార్యక్రమం నిర్వహించారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



మాచర్ల : రాష్ట్ర వ్యాప్తంగా నవోదయ పాఠశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష శనివారం మాచర్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో జరిగింది. 276 మందికి గాను 225 మంది హాజరయ్యారు. ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు పరీక్ష జరిగింది. సెంటర్ సూపరింటెండెంట్ వి.శ్రీనునాయక్ పర్యవేక్షించారు.

వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా భార్గవ



పిడుగురాళ్ల: వాణిజ్య పన్నుల శాఖ పిడుగురాళ్ల అసిస్టెంట్ కమిషనర్ (సేల్‌ట్యాక్స్)గా శనివారం వావిలాపల్లి భార్గవ బాధ్యతలు స్వీకరించారు. 2022 బ్యాచ్ గ్రూప్ -1 శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం మొదటి పోస్టింగ్ ఇక్కడే పొందారు. ఇప్పటి వరకు పిడుగురాళ్ల సర్కిల్ ఇన్‌చార్జిగా వ్యవహరించిన సత్తెనపల్లి అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునరావు, సిబ్బందితో నూతన అసిస్టెంట్ కమిషనర్‌ను పరిచయం చేశారు. కార్యక్రమంలో సీటీఓ కార్యాలయ సిబ్బంది, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల పరిశీలనకు బృందాలు



డి.వేణుబాబు

మాచర్ల: పట్టణంలో దివ్యాంగుల పింఛనుకు సంబంధించి 854 మంది వివరాలను ప్రత్యేక బృందాలు పరిశీలిస్తాయని మున్సిపల్ చైర్మన్ డి.వేణుబాబు శనివారం తెలిపారు. దివ్యాంగ పింఛను దారులు అందుబాటులో ఉండాలన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

మాచర్ల: పట్టణంలో ఆర్పీలందరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహ్మారావు అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఆర్పీలతో చైర్మన్‌తోపాటు ఇన్‌చార్జి మెప్మా ప్రాజెక్టు అధికారి రాజశేఖర్, సీఓ అంజలి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. 32 మందికిగాను 10 మంది ఆర్పీలు కూడా హాజరుకాకపోవటం తగదన్నారు. అనంతరం ఆయా ఆర్పీల పరిధిలో కార్యకలాపాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రజల గొంతుల్లోకి కలుషిత జలం

- బోరు నీటితో తలెత్తుతున్న పలు ఆరోగ్య సమస్యలు
- వాటర్ గ్రిడ్ కోసం పల్నాడు ప్రజల ఎదురుచూపులు



కారెంపూడిలో నేరుగా బోరు నుంచి కొళాయిలకు సరఫరా అవుతున్న తాగునీరు

కారెంపూడి: తరతరాలుగా సురక్షితమైన తాగు నీటిని అందించిన చెరువులు, బావుల నీరు తాగడానికి పూర్తిగా దూరం కావడంతో ప్రజల గొంతుల్లోకి రకరకాల మార్గాల ద్వారా కలుషిత నీరే వెళ్తోంది. 500 నుంచి వెయ్యి అడుగుల లోతు బోర్ల నుంచి వచ్చే కఠిన జలం తాగడం వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. కిడ్నీల పనితీరు కూడా దెబ్బతింటోంది. తరచూ అనారోగ్య సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో సురక్షిత మంచినీటి కోసం పల్నాడు ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. పల్నాడు వాటర్ గ్రిడ్ ఎప్పుడు వస్తుందా అని ఆశగా వేచి ఉన్నారు.

పరీక్షల్లోనూ తేలిందిదే..

ప్రస్తుతం ఈ ప్రాంతంలో 90 శాతం ప్రజలు బోరు నీటినే తాగుతున్నారు. లేకుంటే ఆర్ఓ వాటర్ తీసుకుంటున్నారు. ఆర్ఓ వాటర్‌లో మినరల్స్ లేవని, టీడీఎస్ 20 కంటే తక్కువగా ఉందని, అవి తాగితే కూడా సమస్యలొస్తాయని నిపుణులు చెబుతున్నారు. అవి తాగడానికి రుచిగా ఉన్నా ఉపయోగం లేదంటున్నారు. వాటి వల్ల కూడా సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సర్‌ఫేస్ వాటర్ లభ్యం కాక దాదాపు 90 శాతం ప్రజలు బోరు నీటినే తాగుతున్న పరిస్థితి. పల్నాడులో బోరు వాటర్‌లో టీడీఎస్ 500 నుంచి 2,000 వరకు ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. అందుకే ప్రజలు పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పూర్తి కోసం ఎదురు చూస్తున్నారు. ఆర్ఓ వాటర్ మినరల్ అని చెబుతున్నా వాటిలో మినరల్స్ ఉండడం లేదు. వాటిని పరీక్షించిన వారికి టీడీఎస్ 20 కంటే తక్కువగానే ఉన్నట్లు తేలింది.



సురక్షితమైన నీటి టీడీఎస్ 63గా చూపుతున్న మీటర్



టీడీఎస్ పరీక్ష చేసి చూపుతున్న పర్యావరణ వేత్త జాజి

కలుషిత నీటినే తాగుతున్నాం..

కారెంపూడి వినుకొండ రోడ్డు ప్రాంతంలోని వడ్డెర గడ్డలో టీడీఎస్ 350 పైనే ఉంది. మేం పరీక్షించాం. గరిష్టంగా 500 వరకు కూడా ఉంది. క్యాన్ వాటర్ పరీక్ష చేస్తే టీడీఎస్ 20 కంటే తక్కువ ఉంది. మినిరల్ వాటర్ అని కొని తాగితే దీనివల్ల కూడా ఉపయోగం లేకపోగా ఇంకా సమస్యలొస్తాయంటున్నా రు. సాగర్ కాల్వ నీరు తాగడానికి పనికి వస్తుంది. ఇంట్లో ఆర్ఓ ఏర్పాటు చేసుకున్న వారి నీటిని పరీక్షిస్తే 63 వరకు వచ్చింది. ఇది సురక్షితమే. దీనిని బట్టి ఎక్కువ మంది కలుషిత నీటిని తాగుతున్నారని స్ప ష్టం అవుతోంది. పర్యావరణం దెబ్బతినడంతో పాటు భూగర్భ జలాలు కూడా కఠినత్వాన్ని పొందాయి.

– కొమెర అంకారావు (జాజి), పర్యావరణ వేత్త, కారెంపూడి

ఎన్టీఆర్‌కు నివాళులు

మాచర్ల: పేదల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం ఆర్ అండ్ బీ బంగ్లా ఎదుట ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యేతోపాటు మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహ్మారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, నాయకులు యెనుముల కేశవరెడ్డి, పంగులూరి అంజయ్య, కంభంపాటి అనిల్ కుమార్, మద్దిగపు చిన వెంకట్రామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పాత మాచర్లలో పోలేరమ్మ దేవాలయం వద్ద ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమానికి టీడీపీ నాయకులు యెనుముల కేశవరెడ్డి, నర్రా గురవారెడ్డి, సూరె యలమందలు హాజరయ్యారు.

రెంటచింతల: దేశ రాజకీయాలలో ఎన్టీఆర్ చరిత్ర సృష్టించారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం రెంటచింతలలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆయన నివాళులు అర్పించారు. మండల టీడీపీ అధ్యక్షుడు సీహెచ్ అబ్బిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ బొడపాటి రామకృష్ణ, పార్టీ నేతలు చేరెడ్డి కృష్ణారెడ్డి, మూలి రాజారెడ్డి, ఎన్. శ్రీనివాసరావు, దండే శివయ్య, సిద్దయ్య, బి. మల్లయ్య పాల్గొన్నారు.

విజయపురిసౌత్: కూటమి నేతల ఆధ్వర్యంలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని అంబేడ్కర్ సెంటర్ వద్ద నిర్వహించారు. టీడీపీ నేతలు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, డాక్టర్ ఎస్.బసివిరెడ్డి, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు అప్పలరాజు, సత్తిబాబు, జనసేన అధ్యక్షుడు రాహుల్, పరమేశ్వరావు, ఘంటా ధనుంజయరావు, ఊరే మార్క్, చంద్రశేఖర్, మస్తాన్, నర్సింహులు, శ్రీను, బాలస్వామి, చరణ్, పవన్, రామ్ చంద్, సూకరాజు, శివ, పురాణం శ్రీను, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



మాచర్లలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

కారెంపూడి: కారెంపూడిలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేతలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు.

ఆశ్రమంలో అన్నదానం

గురజాల: స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఎన్టీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తన్నేటి పున్నయ్య, చాగంటి బ్రహ్మయ్య, చల్లగుండ్ల వెంకటేశ్వర్లు, నారాయణభట్ల సుబ్రహ్మణ్యం, పి.సైదారావు, అలివేలు, ఆశ్రమం నిర్వాహకుడు చింతకాయల ఏసయ్య తదితరులు పాల్గొన్నారు.

గురజాల: స్థానిక బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండె చప్పుడు ఎన్టీఆర్ అన్నారు. టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ ప్రజాసేవకోసం అయిదు వాహనాలను ప్రారంభించారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, ఎన్. బొల్లయ్య, అడపా శ్రీనివాసరావు, కె. అంకారావు, నజీమూన్, శరమాళ్ల హనుమంతరావు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్ర పటానికి ఎమ్మెల్యే యరపతినేని ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కందిలో సస్యరక్షణతో అధిక దిగుబడి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో కంది సాగు చేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రెంటచింతల, మిట్టగుడిపాడు, రెంటాల గ్రామాలలో ఆయన కంది పంట పొలాలను సందర్శించారు. పంట సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. గొంటు కోటిరెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న కంది పంటను పరిశీలించి పలు సూచనలు చేశారు.



రైతు గొంటు కోటిరెడ్డికి వివరిస్తున్న ఏఓ బ్రహ్మారెడ్డి

రిమాండ్ ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలి

సత్తెనపల్లి: సబ్ జైల్లో రిమాండ్ ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలని సత్తెనపల్లి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, రెండవ అదనపు సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్ సూచించారు. పట్టణంలోని సబ్ జైల్‌ను శనివారం న్యాయమూర్తులు సందర్శించారు. సబ్ జైల్‌లోని పరిసరాలను నిశితంగా పరిశీలించారు. అక్కడ ఉన్న ఆహారం, నిత్యవసర సరుకులు నాణ్యతను పరిశీలించారు. న్యాయవాదిని నియమించుకోలేని రిమాండ్ ముద్దాయిలకు ప్రభుత్వం న్యాయవాదిని నియమించి, ఉచితంగా న్యాయ సేవలను అందిస్తుందని తెలిపారు. డాక్టర్ గిరిరాజు, సబ్ జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం, పట్టణ ఎస్ఐ పవన్ కుమార్, లీగల్ వలంటీర్ షేక్ సుభాని పాల్గొన్నారు.



నిత్యావసరాల నాణ్యతను పరిశీలిస్తున్న న్యాయమూర్తులు

కళ్లం మునెమ్మకు ఘన నివాళులు

బొల్లవరం(ముప్పాళ్ళ): మరణంలోను కళ్లం మునెమ్మ జీవించి ఉన్నారని, అవయవదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని బొల్లవరం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన సీపీఎం నాయకురాలు, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) పూర్వ సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షురాలు కళ్ళం మునెమ్మ సంస్మరణ సభ శనివారం జరిగింది. సీపీఎం నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన విజయ్‌కుమార్ మాట్లాడారు. సమసమాజ నిర్మాణం కోసం కళ్ళం మునెమ్మ, సత్యనారాయణరెడ్డి దంపతులు అందరికీ ఆదర్శవంతంగా పనిచేశారన్నారు. మునెమ్మ తన దేహాన్ని మెడికల్ కళాశాలకు దానం చేసి వైద్య విద్యార్థులు పాఠాలు నేర్చుకునేందుకు ఉపయోగపడ్డారన్నారు. నరసరావుపేటలో నిర్మాణమవుతున్న విజ్ఞానకేంద్రానికి ఐదు లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించారన్నారు. మల్లీశ్వరి, గద్దె ఉమశ్రీ, గుంటుపల్లి రజని, మన్నెం శారద పాల్గొని మునెమ్మ సేవలను కొనియాడారు. ఆమె చిత్ర పటానికి నివాళులర్పించారు.



బస్సు షెల్టర్ ప్రారంభం

పిడుగురాళ్ల: పట్టణంలోని గుంటూరు బస్సులు ఆగే ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు షల్టర్‌ను గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. పట్టణానికి చెందిన స్వర్గీయ దాచినేని ఆంజనేయులు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మల్లికార్జునరావు దీన్ని నిర్మించారు.

భవనం పైనుంచి పడి పెయింటర్ మృతి



దాచేపల్లి: ప్రమాదవశాత్తు అపార్టుమెంట్ పై నుంచి కిందపడి పెయింటర్ మృతి చెందిన సంఘటన శనివారం దాచేపల్లిలో జరిగింది. దాచేపల్లికి చెందిన షేక్ కరీముల్లా (40) పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఓ అపార్ట్‌మెంట్‌లో పనులకు వెళ్లాడు. పై భాగంలో తాడు సాయంతో పెయింటింగ్ వేస్తుండగా తాడు తెగి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వైద్య చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల తరలిస్తుండగా మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

రెంటచింతల: మండలంలోని తుమృకోట గ్రామంలో ఈ నెల 15 వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తోట అమరలింగయ్య(60) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు. గ్రామంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నల్లబోతుల రిషి వర్ధన్, తోట అమరలింగయ్య, షేక్ బాబర్‌వలి, షేక్ రహమాన్‌లు గాయపడ్డారన్నారు. అమరలింగయ్యకు బలమైన గాయలు కావడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వెల్లడించారు.

బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత పాటించాలి

రెంటచింతల: మండలంలో చేపట్టిన మాచర్ల – దాచేపల్లి బైపాస్ రోడ్డు(ఎన్‌హెచ్–167 ఏడీ) 5 కి.మీ నిర్మాణంలో భాగంగా స్థానిక రామకృష్ణ గురుకుల పాఠశాల సమీపంలో నిర్మిస్తున్న గోలివాగు హైలెవల్ పనులను నాణ్యతతో చేపట్టాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మాచర్ల: స్వచ్ఛ మాచర్లగా పట్టణాన్ని మార్చటానికి కృషి చేద్దామని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహ్మారావు అన్నారు. శనివారం పట్టణంలోని స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ళ వేణుబాబు, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహ్మారావుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. మున్సిపల్ డీఈ సుభాని, ఏఈలు గౌతమి, తేజ , మెప్మా ప్రాజెక్టు ఇన్‌చార్జి, ప్రాజెక్టు ఆఫీసర్ రాజశేఖర్, సీఓ అంజలి, ఆర్ఐ వెంగయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజా తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో శనివారం స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఎంపీడీఓ జి. శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ కసిన్యానాయక్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ కూరాకుల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా మార్చుదాం

రెంటచింతల: ప్లాస్టిక్ రహితంగా రాష్ట్రాన్ని మార్చేందుకు అందరూ సహకరించాలని ఎంపీడీఓ కె. సరోజినిదేవి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం రెంటచింతలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు సీహెచ్ అబ్బిరెడ్డి, మాజీ సీహెచ్‌సీ చైర్మన్ బి. రామకృష్ణ, ఏపీఓ జయచంద్రకుమార్, మున్నా ప్రభురాజు, చేర్రెడ్డి కోటిరెడ్డి, మూలి రాజారెడ్డి, చేర్రెడ్డి కృష్ణారెడ్డి, ఎం. చిన్న శౌర్రెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, సిద్దయ్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ముఖ్యం

గురజాల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. మేదర కాలనీ అంగన్‌వాడీ సెంటర్ నందు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ వై.రత్నకుమారి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సాయి కర్ణకుమార్, సుధీర్ ప్రతిజ్ఞ చేశారు.

మాచర్ల రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు రావని తహసీల్దార్ డి. కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆయన ప్రారంభించి, మాట్లాడారు. డిప్యూటీ తహసీల్దార్లు బత్తుల వాణి, రమణ, పల్నాడు జిల్లా రెవెన్యూ ఉద్యోగుల వీఆర్ఓ సంఘం అధ్యక్షుడు ఆరుముళ్ళ నాగేశ్వరరావు, టైపిస్టు శ్రీవలి, సీనియర్ అసిస్టెంట్ రంగారావు, వీఆర్ఓలు వెంకట్రావు, నాగలక్ష్మి, ప్రవీణ్, జలీల్, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.



మాచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కారెంపూడిలో డ్రైనేజీ కాల్వ శుభ్రం చేస్తున్న కార్మికులు



రెంటచింతల కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు



గురజాల ఆర్డీవో కార్యాలయంలో సిబ్బంది ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేయిస్తున్న మాచర్ల రూరల్ తహసీల్దార్ కిరణ్‌కుమార్

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి: పిన్నెల్లి

మాచర్ల: వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగ అధ్యక్షుడు సిద్ధారపు గాంధీ యాదవ్ శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పదవికి ఎంపిక అవటానికి తనకు సహకరించినందుకు పీఆర్కేను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గాంధీకి అభినందనలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బీసీలతోపాటు అన్ని వర్గాలను చైతన్యపరచి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. పీఆర్కేని కలిసిన వారిలో గురజాల వైఎస్సార్‌సీపీ నాయకులు పలువురు ఉన్నారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న సిద్ధారపు గాంధీ యాదవ్

ఆదివాసీ గిరిజన సదస్సు జయప్రదం చేయండి

మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ గిరిజన సమస్యలు తెలుసుకునేందుకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆదివాసీ గిరిజన సదస్సుకు అందరూ తరలి రావాలని ఉమ్మడి జిల్లా గిరిజన ప్రజా సమైఖ్య అధ్యక్షుడు నూన్సావత్ రంగానాయక్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెనుకబడిన గిరిజనులు ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు.



ప్రాణహాని ఉందని వివాహిత సెల్ఫీ వీడియో

పిడుగురాళ్ల: తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని, తగిన న్యాయం చేయాలని పిడుగురాళ్ల పోలీసులను ఆశ్రయిస్తే ఎవరూ స్పందించటం లేదని ఓ వివాహిత సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. పిడుగురాళ్ల జానపాడు గ్రామానికి చెందిన నూతి అరుంధతి శనివారం దీనిని విడుదల చేశారు. సెల్ఫీ వీడియోలో ఆమె తెలిపిన వివరాల ప్రకారం... బిజిలి వెంకట్రావు రెండవ భార్య అయిన తాను మనస్పర్థల కారణంగా దూరంగా ఉంటున్నానని చెప్పారు. గొడవ జరగటంతో పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆరోపించారు. తన కుటుంబాన్ని బెదిరిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ఓ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జిగా బిజిలి వెంకట్రావు వ్యవహరిస్తున్నారు.

రేపటి నుంచి పశువైద్య శిబిరాలు

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశువైద్య శిబిరాలు జరుగుతాయని రాజుపాలెం పశువైద్యాధికారి వీరయ్య శనివారం తెలిపారు. 20న అంచులవారిపాలెం, బలిజేపల్లి, 21న బ్రాహ్మణపల్లి, 22న రాజుపాలెం, 23న నెమలిపురి, 24న దేవరంపాడు, ఇనిమెట్ల, 25న గణపవరం, 27న అనుపాలెం, 28న చౌటపాపాయపాలెం, వీరమ్మకాలనీ, 29న రెడ్డిగూడెం, లక్ష్మీపురం తండా, 30న రామిరెడ్డిపేటలో శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు.

బెల్లంకొండలో..

బెల్లంకొండ: మండలంలో పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశు వైద్యుడు బాలకృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నాగిరెడ్డిపాలెం, 21న మాచాయపాలెం, 24న నందిరాజుపాలెం, 25న చంద్రాజుపాలెం, 27న కందిపాడు, 28న పాపాయపాలెం, 29న ఎమ్మాజీగూడెం, 30న మన్నెసుల్తాన్ పాలెంలో నిర్వహిస్తారని తెలిపారు.

అచ్చంపేట: ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి స్వాతీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి ఎం .పుల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గేదెలు, దూడలు, జీవాలకు నట్టల నివారణ మందు, గర్భకోశ పరీక్షలు, జీవాలకు బొబ్బ టీకాలు అందిస్తామన్నారు.